
# నిను వినా...



ఆంధ్రభూమి, 24 మార్చి 1994

"హలో! ఎలా గడిచింది నిన్న సాయంత్రం?" కంప్యూటర్ రూమ్‌లోకి నేను అడుగు పెట్టగానే నా వెనకాల స్ప్రింగ్‌డోర్ యింకా మూసుకోకముందే ఆదిత్య కళ్ళెగరేస్తూ మిశ్చివస్‌గా అడిగాడు.

చాలా బాగా గడిచిందన్న భావం వ్యక్తమయ్యేలా నేను నవ్వాను. కొన్ని భావాలు మాటల్లోకి అనువదిస్తే అందంగా వుండవు. ఒక చిన్న నవ్వో, భుజాల ఎగరేవేతో వాటి అందాన్ని యినుమడిస్తుంది.

"ఒక పెగ్ విస్కీ, చేతుల్లో పదునైన ఆడపిల్ల, లయబద్ధమైన సంగీతం... ఈ మూడింటి కలయిక పాశ్చాత్యులు కనిపెట్టిన అద్భుతం"

అతని మాటల్తో ఏకీభవిస్తున్నట్టు తలూపాను. నిన్నటి సాయంత్రం పొందిన ఆనందం తాలూకు అనుభూతి యింకా నా నరనరాన ఫ్రెష్‌గా వుండి, రెండో యవ్వనమంటారే అది వూపందుకున్నట్టుగా వుంది.

నిన్న సాయంత్రందాకా నేనో భిన్నమైన వ్యక్తిని. నలభయ్యేడేళ్ళు మీదపడి, ఎత్తుకోవలసినవిగానీ తీర్చుకోవలసినవిగానీ బాధ్యతలంటూ ఏమీ లేక ఎడారిలా విస్తారంగా మిగిలిపోయిన కడపటి జీవితాన్నెలా గడపాలో తెలీక అయోమయంగా నిల్చున్న వంటరి బాటసారిని. నిస్తేజం, నిస్పృహ అడుగు ముందుకి వెయ్యనివ్వకుండా చెరో రెక్కా పట్టుకుని ఆపుతుండేవి. కాలం కదుల్తుండేదికాదు నా వయసువాడే ఆదిత్యవర్మ. చాలా హుషారుగా వుంటాడు. కొత్తకొత్త హిందీ పాటల్ని విజల్ మీద పాడుకుంటూ చలాకీగా వర్క్ చేసుకుంటాడు.

చెప్పడం మరిచా, ఈ కంప్యూటర్ రూమ్‌లో వుండేది మేమిద్దరమే. మాతోపాటు ఎమ్డీ సీటు కూడా వుంటుందిగానీ ఆయనెప్పుడూ సీట్లో వుండడు. మహావుంటే నెలకి వారం

రోజులుంటాడు. మిగిలిన రోజుల్లో ఫ్రీయే. పనెంత వున్నా పైన అంకుశం పెట్టి పొడిచేవాడు లేకపోతే సునాయాసంగా చేసుకోవచ్చు. మాకు వర్క్ ఎక్కువగా వుండేది మొదటి వారంలోనూ ఆఖరి వారంలోనూ. మిగిలినప్పుడు ఫ్రీగానే వుంటుంది. కబుర్లు చెప్పుకుంటూ లీజర్‌గా చేసుకోవచ్చు.

మాకిద్దరికీ పూర్వ పరిచయం వుందిగానీ తక్కువ. ఈ కంప్యూటర్ సెక్షన్‌లోకి వచ్చాకే పెరిగింది. ఇంకా ఏడాది కలిసి వర్క్ చెయ్యాలి. టర్న్ మీద యిక్కడ పోస్టింగిస్తారు. కంప్యూటర్ మీద పని చెయ్యాలన్న వుత్సుకతకన్నా ఏసీ ఛాంబర్లో వుండొచ్చన్న కోరిక బలీయమైనది కావటంచేత ఈ సెక్షన్‌కి కాంపిటేషన్ చాలా ఎక్కువ అలాంటి సరదాతో వచ్చినవాడే ఆదిత్యవర్మ.

మా డిపార్ట్‌మెంటు కంప్యూటరైజ్ చేస్తారని టాక్ రాగానే హడావిడిగా నిట్‌లో చేరి ఆర్నెల్ల కంప్యూటర్ కోర్సులో సర్టిఫికెటు తీసుకుని సీనియారిటీ లిస్టులో అందర్నీ తోసుకుంటూ .. మొదటి వరసలో నిల్చున్న ఈ ఆదిత్యవర్మకి జీవితమంటే చాలా మక్కువ. ప్రతి క్షణాన్నీ ఆప్యాయంగా స్పృశిస్తూ జాగ్రత్తగా పంపిస్తాడు.

పలానా పిక్చర్ చూసావా అనో యింకో పిక్చర్లో శ్రీదేవి యాక్షనెలా వుందనో అడిగేవాడు. ఈ రకమైన ప్రశ్నలు పదేపదే అడుగుతుండడంచేత కొంతకాలం అతనికి నేను విలువనివ్వలేదు. ఈ వయసులో యివేం బుద్ధులని యావగించుకుని ఒక విధమైన రిజర్వుడ్‌నెస్‌ని మేంటేన్ చేసాను. ఓసారి బైటికే అనేసాను కూడా.

"ఎదిగిన పిల్లల ముందు అలాంటి సినిమాలేం చూడగలం?"

అతను నన్ను వింత మృగాన్ని చూసినట్టు చూసి, "పిల్లలు ఎదిగారా? సోవాట్? వాళ్ళ భార్యల్తో వాళ్ళు వెళ్తారు. మన భార్యల్తో మనం వెళ్తాం. మనం చూడకూడదని ఎక్కడైనా రూలుందా?" అని అడిగాడు.

నేనీ జవాబుని వూహించలేదేమో గుటక మింగాను. "చూడకూడదని కాదనుకో మా మనవడితో ప్రాబ్లం" అన్నాను.

"వాట్ మేన్, మనవడితో ప్రాబ్లమా? వాణ్ణి నీ దగ్గిర పడుకోబెట్టుకోవడం అదీ చేస్తున్నావా? ఐతే ఫినిష్. నీకు నీ కొడుకుపట్ల ఎంత బాధ్యతుందో నీ కొడుక్కి తన కొడుకుపట్ల అంత బాధ్యత వుండదా? కొడుకుతో ఎటాచిమెంట్సు పెంచుకో. మనవణ్ణి నీ కొడుక్కొదిలేయ్" అని ఒక్క క్షణం ఆగి "నేనేదో పెద్ద తెలిసిన వాడిలా చెప్తున్నాననుకోకపోతే మరొక్కమాట" అన్నాడు.

అతని మాటల్లో నాక్కాస్త కుతూహలం కలిగిందేమో, నవ్వుతూ తలూపాను చెప్పమని.

"ప్రతీదీ స్పూన్ ఫీడింగ్ అలవాటు చేస్తున్నాం మన పిల్లలకి. ప్రతి మనిషికీ తప్పనిసరిగా ఎత్తుకోవల్సిన బాధ్యతల్ని కూడా మనమే నెత్తి మీద వేసుకుంటే యింక వాళ్ళు చేసేదేమిటి? వాళ్ళ పిల్లాణ్ణి వాళ్ళ దగ్గిర పడుకోబెట్టుకోవడం వాళ్ళకి కష్టమా? కష్టమని నేర్పించకపోతే కష్టమవదు. కాస్తంత ఆలోచించి చూడు. దాంపత్య సుఖాన్ని కూడా మనమే స్పూన్ ఫీడింగ్ చేయిస్తే భార్యకి భర్త మీద, భర్తకి భార్యమీద మోజు తొందరగా కరిగిపోతుంది. మనిషిది ఎప్పుడూ పసివాడి మనస్తత్వమే. అందే దాకా ఆరాటపడతాడు. తీరా అందాక మోజు తీరిపోతుంది. భార్యా భర్తలు మంచి మూడ్‌లో వుంటారు. ఇంతలో వుయ్యాల్లో పిల్లాడు గొడవ చేస్తాడు. వాడికోసం వాళ్లా రోజుని త్యాగం చేసి యింకో రోజుకోసం ఆతృతగా ఎదురుచూస్తాడు. అలాంటి రసానుభూతి చచ్చిపోతుంది, చిన్న చిన్న ఆటంకాలు లేకపోతే".

"నువ్వు చెప్పింది నిజమే".

"మన వయసు వాళ్లెవరు తటస్థపడినా నేనిలాగే చెప్తాను. భాధ్యతలు తీర్చుకున్నాక యింటి విషయాల్లో కొంత డిటాచ్‌డ్‌గా వుండాలి. అప్పుడే జీవితాన్ని ఎంజాయ్ చెయ్యగలం. ఒక్క మనమే కాదు, మన పిల్లలు కూడా".

"ఈ యేజిలోనా, జీవితాన్ని మనం ఎంజాయ్ చెయ్యడం?"

"ఎస్... యిప్పుడే! వయసులో వున్నప్పుడు మన పిల్లలు, వాళ్ళ బాధ్యతలు. వాటినెవరూ పంచుకోరు. పంచుకున్నా తరగనివి. ఇప్పుడవన్నీ తీరిపోయాయి. యంజాయ్.. యంజాయ్ యువర్ సెల్ఫ్".

నేను ఫక్కుమని నవ్వాను. "నాలుగడుగులేస్తే కాళ్ళు నొప్పులంటుంది శ్రీమతి. ఆవిడకి వోపికున్న రోజుని గుళ్ళకీ భజన సంఘాలకీ తిరుగుతుంటాం'

"అరవయ్యేళ్ళొస్తేనేగానీ మనసుకి నిలకడరాదు ఆ నిలకడ వస్తేగానీ నిజమైన భక్తి పుట్టదు. నిజమైన భక్తి పుట్టాలంటే ప్రలోభాలేవీ మిగిలి వుండకూడదు. అందుకే అనుభవించిందంతా ఆనందోబ్రహ్మ. ఆ తర్వాత మనకి కనిపించేది అసలు పరబ్రహ్మ. మా మామగారు వున్నాడ్లే. అత్తగారు పోయింది. ఆవిడ బ్రతికున్నంతకాలం ఆయన్ని చెండుకుని తినేది. ఇప్పుడామె లేదుకదా, ఈయన పనిమనిషితో సరసాలాడతాడు. నలుగురూ ఛీకొట్టినా సరే, బుద్ధి మారదు. అందుకే అంటారు, కోరికలు తీరకపోతే మనో వికారాలౌతాయని, ఎవళ్ళో ఏదో అనుకుంటారని బలవంతంగా ముసలితనం తెచ్చుకోవద్దు మీరు. జస్ట్ ఫ్రెండ్లీ ఎడ్వైజ్".

కొంచెం సీరియస్‌నెస్ చోటు చేసుకోవడం చేతననుకుంటా, సంభాషణ అక్కడితో ఆగిపోయింది. కానైతే నా మీద గట్టి ప్రభావాన్ని చూపించిందని వప్పుకోవాలి. ఆదిత్యవర్మ కోణం లోంచీ ఆలోచించడం మొదలుపెట్టాను.

నా భార్య బియ్యే చదివింది. పెళ్ళయాక మాకు తెలిసిన వాళ్ళ స్కూళ్ళో టీచరుగా వేయించాను. పిల్లలు పుట్టాక వుద్యోగానికీ యింటికీ లంగరందక వుద్యోగం వదిలేసింది. పెద్ద దిక్కు లేకుండా పిల్లలిద్దర్నీ పెంచి యింతవాళ్ళని చేసాము. ఇప్పుడు వాళ్ళని చూస్తుంటే ఎంతో గర్వంగా వుంటుంది. అలాంటి అద్భుతానందం నా కొడుక్కి దూరం చేస్తున్నానేమో మనవడి భారం పుంచుకుని అని భావించాను మొదటి మెట్టుగా.

మైనే ప్యార్ కియా సినిమాకి శ్రీమతితో వెళ్ళాలని ప్లాన్ చేసాను. కానీ ఆమె వప్పుకోలేదు. "పిల్లలు వెళ్ళే సినిమాలకి మనం వెళ్లడమేంటి? ఏ సినిమాకు వెళ్ళారని కొడుకూకోడలూ అడిగితే ఏం చెప్తాం?" అంది. నిజమేననిపించింది నాక్కూడా. ఇంక దేనికేనా వెళ్దామని ప్రపోజ్ చేసాను. "పిల్లల్లేకుండా ఎప్పుడేనా సినిమాలకెళ్ళామా?" అని తోసిపారేసింది.

'ఇది భాయీ నా ప్రగతి" అన్నాను ఆదిత్యతో.

"సోవాట్? గాళ్ ఫ్రెండుని చూసుకో" అనేసాడు.

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాను 'గాళ్ ఫ్రెండా?'

"బెడ్ మేటన్నట్టు అలా హడిలిపోతావేం? పిక్చర్స్‌కి వాటికీ కంపెనీ యివ్వడానికి గాళ్ ఫ్రెండు.

ఇంట్లోవాళ్ళ ఎంటర్‌టేన్‌మెంట్‌కి టీవీ వుండనే వుంది" అన్నాడు.

నేను అమెరికాలో వున్నావా బొంబాయిలో వున్నావా అనే విషయం మీద నాకు అనుమానం

కలిగింది. గిల్లి చూసుకున్నాను. ఇండియాలోనే వున్నాని నిర్ధారణ చేసుకున్నాను.

నిజం చెపొద్దూ, నేను ప్రలోభంలో పడ్డాను.

ఫలితమే నిన్నటి ఔటింగ్, డిస్కో క్లబ్‌కి నన్ను యింట్రడ్యూస్ చేసాడు ఆదిత్యవర్మ. డిపాజిట్ కట్టి మెంబర్‌షిప్ తీసుకున్నాను. నాకు గాళ్ ఫ్రెండుని వెతికిపెట్టే బాధ్యత కూడా తనే తీసుకుని, కంపెనీ లేక దిగులుగా నిలబడిన ఒకమ్మాయిని తీసుకొచ్చి పరిచయం చేసాడు.

ఇరవై మూడేళ్ళుంటాయి. వర్కింగ్ గాళ్‌ట, వీకెండ్స్‌లో తనూ, తన బాయ్ ఫ్రెండూ యిక్కడి కొచ్చి కలుసుకుంటారట. ఈ వేళ అతనెందుకో రాలేదంది.

"అతను గానీ వస్తే ఏమీ అనుకోడా?"

"ఇందులో తప్పేముంది? డాన్సేగా?"

డాన్స్ ఫ్లోర్‌మీదికి వెళ్ళాము. హోరెత్తించే మ్యూజిక్‌కి అనుగుణంగా వెలిగి ఆరుతున్న లైట్ల మధ్య లేట్‌నైట్ దాకా స్టెప్స్ వేసాము. నాతో డేన్స్ చెయ్యడానికి యిరవై మూడేళ్ళ ఆ అమ్మాయికెలాంటి అభ్యంతరమూ లేకపోయిందిగానీ నాకు మాత్రం కాసిని అభ్యంతరాలు కనిపించాయి. మొదటిది - ఆ పిల్ల బొత్తిగా అపరిచితురాలు కావడం. రెండు - నా మీసాల్లోంచీ తల్లోంచీ తొంగిచూస్తున్న తెల్లవెంట్రుకలు. మూడు ఆ పిల్ల వయసుకి నా వయసు రెట్టింపు వుండటం.

"మరీ అంత స్టిఫ్‌గా వుండకు. ఈ తాతయ్యానో పట్టు పడదామనుకుంటుంది" జోవియల్‌గా హెచ్చరించాడు ఆదిత్య.

మొదట్లో కాస్త యిబ్బంది పడ్డప్పటికీ తర్వాతర్వాత టైమెలా గడిచిందో తెలీలేదు.

★★★

ఆదిత్య పలకరింపుతో యిప్పుడా అనుభూతి పునరావృతమైంది. సాయంత్రం మళ్ళీ అక్కడికే వెళ్ళాలని మనసుపీకినా యింటికే లాక్కెళ్ళాయి కాళ్ళు.

నిన్న వుదయం పదింటికి యింట్లోంచీ బైట పడ్డాను. ఆఫీసయ్యాక అటెళ్ళాను. అట్నించీ యింటి కెళ్ళేసరికి పదకొండు. అంతా మంచి నిద్రలో వున్నారు. మళ్ళీ వుదయం ఆరింటికల్లా కోర్టు వ్యవహారం మీద ప్లీడర్ని కలవాలని బైటికొచ్చాను. అప్పుడే ఐదైంది. అక్కడి పరిస్థితేమిటో తెలీదు.

నా కొడుక్కీ కోడలికీ బోలెడంత మంది ఫ్రెండ్సు. నిన్నటి వ్యవహారం వాళ్ళకెవరేనా చేరవేసారేమోనన్న అనుమానం నాలో పొడచూపింది. వీలైనంత త్వరగా యిల్లు చేరాను.

నే వెళ్ళేసరికి హాల్లో ఒక సీన్ నడుస్తోంది. శ్రీమతి హాల్లో సోఫాలో కూర్చుని చీరకొంగుతో కళ్ళొత్తుకుంటోంది. సోఫా వెనకాల నిలబడి తన భుజాల మీద చేతులేసి వంగి ఏదో చెప్తున్నాడు నా కొడుకు. పక్కని కూర్చుని ఓదారుస్తోంది కోడలు.

నేననుకున్నంతా అయ్యింది. నా శ్రీమతి యింత దుఃఖపడడానికి యింతకిమించి వేరే యే కారణమూ వుండదు. వుండక్కర్లేదు కూడా నిజానికి నేను చేసిన దాంట్లో తప్పేముందని? రిటైర్డు మిలట్రీ ఆఫీసర్ల దగ్గర్నుంచీ ఆదిత్యవర్మ దాకా ఎందరెందరో వచ్చారు. వాళ్ళని చూస్తుంటే అర్థమైంది నేను జీవితాన్నెంత మిస్ చేస్తున్నానో? ఎందుకింత నిస్తేజంగా గడపాలి నేను - అనే ప్రశ్న వేసుకుంటే తరచి తరచి చూసినా జవాబు దొరకలేదు. ఆదిత్యవర్మ మాటలు అక్షర సత్యాలనిపించాయి. కానీ యిందులో నా మనసు రాజీపడని విషయం ఒకటుంది. అది వేరే సంగతి.

నన్ను చూసీ చూడగానే "తాత్తాత్తా..." అన్నాడు మనవడు కేరింతలుకొడ్తూ. నా వునికిని అందరూ గమనించారు.

కోడలందికదా, "ఇంట్లో వుండేది నలుగురం. అందులో ఒకరు దుఃఖపడుతూ వుండడం ఏమీ బాగోలేదు. దీనికి పరిష్కారం మామయ్యగారే చెప్పాలి. గట్టిగా అడగండి. అదుగో, రానే వచ్చారు" అని అలా అంటూ మా ఆవిడ పక్కనుంచీ లేచి కొడుకుని ఎత్తుకుని చక్కా వాళ్ళ గదిలో కెళ్లిపోయింది.

"మమ్మీ! నువ్విలా దిగులుగా వుంటే నాకు బావోదు. అసలు సమస్యలూ, బాధలూ ఏం వున్నాయని ఈ యేడ్పులు? ఈ వేళే తేల్చెయ్. లేకపోతే మేం వేరే ఫ్లాట్‌లోకి వెళిపోతాం" అని నా కొడుకు నాకేసి చూసి భుజాలెగరేసి నవ్వుతూ తన భార్య వెంట వెళిపోయాడు.

హతవిధీ! ఏం రోజులొచ్చాయి! తండ్రిని ఎంత గౌరవించే వాళ్ళం మేం! వీడేమిటిలా నన్ను చూసి భుజాలెగరేసి నవ్వుతున్నాడు! కించపాటుగా అనిపించింది. ఆ వొక్క క్షణం చాలు, రాజీపడని ఆ విషయంపట్ల నాకు విముఖత కలగడానికి.

నిశ్శబ్దంగా తలొంచుకుని మా గదిలోకి వెళ్ళి కూర్చున్నాను. ఏవో జ్ఞాపకాలు, ఏవేవో సంఘటనలు. నా పెళ్ళవడం, వెంటవెంటనే పిల్లలు పుట్టడం, పిల్లల బాధ్యతల్ని శ్రీమతితో సమానంగా పంచుకోవడం, మళ్ళీ ఏవో విషయాల్లో దెబ్బలాడుకోవడం, రాజీకి రావడం అన్నీ గుర్తొచ్చాయి. గట్టిగట్టి కోపతాపాలు, అలకలు, స్పర్థలు మా మధ్య ఎప్పుడూ తలెత్తలేదు. అలాంటిది యిన్నాళ్ళకి తన మనసుని దెబ్బ తీసాను మరో మనిషిని కేజువల్‌గా నేను మా మధ్యకి తెచ్చి. తుస్సుమని గాలితీసేసినట్టైంది నా పరిస్థితి. బట్టలేనా మార్చుకోకుండా మంచం మీద వరిగాను.

బైట అడుగుల చప్పుడు! చీర రెపరెపలు, గాజుల గలగలలు మిళితమైన సవ్వడి! లేచి కూర్చున్నాను. చేతిలో కాఫీ కప్పుతో శ్రీమతి గదిలోకి అడుగుపెట్టింది. పసుప్పచ్చటి షిఫాను చీర, వాలుజడ, జడలో గులాబీ, త్రుళ్ళిపడ్డాను. కొడుక్కి పెళ్ళి చేసాక నా భార్య జరీ చీరల్లోకి మారిపోయి, వాల్చడని ముడిచుట్టేసి ఒక్కసారి పెద్దరికం తెచ్చేసుకుంది. ఇప్పుడు మళ్లీ యిలా! రెప్ప లార్చుకుని చూసాను. సన్నగా నేవళంగా ఎంతందంగా వుందో!

కాఫీ కప్పు నా చేతికిచ్చింది.

"మీకిలాగే యిష్టమైనప్పుడు నాతో ఒక్క మాటనచ్చుగా?" రుద్ధస్వరంతో అంది.

"ఇప్పుడేమైందని?" ఇబ్బందిగా అన్నాను.

"ఏమీ కాలేదా?" నా భుజాల మీద చేతులేసి కళ్ళల్లో కళ్ళు పెట్టి చూస్తూ అడిగింది. నేను తేలికపడ్డాను సూటిగా తన కళ్ళల్లోకి చూసాను. ఆమె కళ్ళు సంతోషంతో తళతళలాడాయి. అదే నా కళ్ళు అపరాధ భావంతో వాలిపోయుంటే ఆమె నేత్ర ద్వయంలో నీరు నిల్చేదనుకుంటా.

"కొడుకూ కోడలూ కూడా అదే అన్నారు. మేం పెద్ద వాళ్ళమయ్యాము. మీ బాధ్యతలు తీరాయి. ఇంకా వోపిగ్గా వున్నారు. ఇల్లు పట్టుకుని వేళ్లాడతావేమిటమ్మా? నాన్నగారి మనసెందుకు అర్థం చేసుకోవని కోప్పడ్డాడు బాబు -

ఈ వయసులో యివేం కోరికలు - అనడిగాను.

ఇప్పుడు కాకపోతే యింకెప్పుడన్నాడు -

నిజమేననిపించింది నాకు. వాళ్ళు ఆక్షేపిస్తారేమోనని నేను తటపటాయించాను గానీ అసలు

మనమేం అనుభవించామని? పసితనమంతా చదువులు, హోమ్‌వర్కులు, కాలేజి రోజులన్నీ సిటీబస్సుల కోసం వెయిటింగు, తరవాతి రోజులన్నీ సంసార ఝంఝాటాలు.. ఈ ప్రశ్నయిలా నీడలా మనని వెన్నంటి వుంటే దేవుడి మీద మాత్రం మనసేం నిలుస్తుంది? మనిషి గుళ్ళో, మనసు చెప్పులగూళ్ళో".

"థాంక్యూ డియర్. ఎటేనా వెళ్దామా?" హుషారుగా అడిగాను. తలూపింది.

నేను స్కూటర్ స్టార్ట్ చేస్తుంటే కొడుకూ కోడలూ బాల్కనీలోంచీ చెయ్యూపారు. వాళ్ళ ఆనందం కాలిగజ్జెలు, మొలమువ్వలు ఘల్లు ఘల్లు మంటుండగా మెరిసే కళ్ళతో రెయిలింగ్ సందుల్లోంచీ తొంగి చూస్తోంది. వాడికో ఫ్లైయింగ్ కిస్ విసిరాను. ఇప్పుడు నా మనసు రాజీ పడని విషయమంటూ ఏమీ లేదు.